క్లుప్తంగా

పేద విద్యార్థులకు అండగా నిలవాలి


ప్రింటర్‌ను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేంటూరి రవీందర్‌రెడ్డి, నేంటూరి హన్మంత్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ నేంటూరి ప్రఫుల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలకు హన్మంత్‌రెడ్డి ట్రస్టు తరఫున ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను, విద్యార్థులకు కావాల్సిన వనరులను అందజేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాగర్‌కుంట మాజీ సర్పంచ్ శివకుమార్, సీనియర్ నాయకులు హస్మత్‌పాషా, సత్యనారాయణరెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాచ్య, ఉపాధ్యాయులు రాఘవేందర్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న భీంభరత్

చేవెళ్ల: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం మల్కాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి చింపుల సత్యనారాయణరెడ్డి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బి. ఆగిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యాదయ్య, అశోక్‌గౌడ్, శంకరయ్య, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ ఉమర్, జంగయ్య, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, మహేందర్, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

వంతెన లేక తిప్పలు


వాగు దాటుతున్న గిరిజనులు (ఫైల్)

బంట్వారం: వంతెన లేక తండా వాసులు తిప్పలు పడుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధి కంకణాలపల్లి నుంచి మల్‌శెట్టిపల్లి తండాకు వెళ్లే మార్గంలో వాగు ఉంది. ఇది వానాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. ఈ సమయంలో వాగును దాటడం మల్‌శెట్టిపల్లి వాసులకు కష్టతరమే. కానీ.. మరో మార్గం లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని, గమ్యం చేరుకుంటున్నారు. ఈ క్రమంలో అనేకమంది వాహనదారులు, బాటసారులు ప్రమాదాల బారిన పడ్డారు. వంతెన నిర్మాణం కోసం చాలా కాలంగా అధికారులు, పాలకులకు విన్నవిస్తున్నప్పటికీ.. ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై సంబంధిత పీఆర్ డీఈ జితేందర్‌ను వివరణ కోరగా.. ఇప్పటి వరకు బ్రిడ్జి మంజూరు కాలేదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు తీర్మానం ప్రతిని ఇస్తే.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించడం హర్షణీయం


బాలికను అభినందిస్తున్న ఎస్‌ఐ శంకర్

యాలాల: బాలికలు క్రీడల్లో రాణిస్తుండటం హర్షణీయమని ఎస్‌ఐ శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధి విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన తేజశ్రీ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్–18 విభాగం పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారిణిని, పీఎస్ ఆవరణలో ఎస్‌ఐ ఘనంగా సన్మానించి మాట్లాడారు. బాలికలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, రాఘవేందర్, శ్రీనాథ్, చంద్రశేఖర్, పాండు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేకాధికారులు ఎక్కడ?

- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తల పట్టుకుంటున్న ప్రజలు
- పింఛన్లు, ఉపాధి పనులు, గ్రామ సమస్యలపై సందిగ్ధం

షాబాద్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు కనిపించపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏ సమస్య వచ్చినా సర్పంచులకు చెప్పుకునేది. అధికారులు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ తెలియడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో స్పెషలాఫీసర్ల పాలన నడుస్తోంది. రెండు మూడు గ్రామాలను అధికారులకు అప్పగించడంతో గ్రామానికి రోజు వెళ్లాలంటే కష్టం. ఒక్కో గ్రామంలో పలు రకాల సమస్యలు నెలకొంటాయి. రోడ్లు కావాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. స్పెషలాఫీసర్లకు బాధ్యతలు అప్పగించడంతో గ్రామ ప్రజలు, వృద్ధులు, ఉపాధి కూలీలు అయోమయంలో ఉన్నారు. షాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీలకు కేవలం 16 మంది స్పెషలాఫీసర్లను నియమించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉంటే ఆఫీసర్లకు గ్రామంలోని సమస్యలు ఎలా తెలుస్తాయని, సాయంత్రం ప్రజలు ఇంటి వద్ద ఉంటారని పట్టించుకోకుండా వ్యవహరిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లను బదిలీ చేశారు. ప్రస్తుతం మండలంలో ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ ఎండీ అన్వర్ బాధ్యతలు చేపట్టారు. గ్రామ సమస్యలు జిల్లా అధికారికి చెబితే సమస్య పరిష్కారమవుతాయా లేదాని సతమతమవుతున్నారు.


చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

సమయపాలన లేదు..

గ్రామీణ పనులు ఒక ఫొటో, గూగుల్ మ్యాప్‌లో షేరింగ్, ఒక సంతకంలా మారింది స్పెషలాఫీసర్ల తీరు. ప్రతి చిన్న పనిని ఫోన్లోనే పరిష్కరించేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఒక్క ఫొటో వేస్తే చాలనుకుంటున్న పరిస్థితి ఉంది. ఉన్నతాధికారుల విజిట్ లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరి వాదన. గ్రామంలో సమస్యలను అందరిని అడిగి తెలుసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నాగర్‌గూడలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

స్పెషలాఫీసర్లు ఎవరో తెలియదు


స్పెషలాఫీసర్లు ఎవరో తెలియడం లేదు. ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి. గ్రామంలోని ప్రజలకు స్పెషలాఫీసర్ గురించి సభలు నిర్వహించి అవగాహన కల్పించాలి.
– పి. రాఘవేందర్, హైతాబాద్, షాబాద్ మండలం

సూచనలిస్తున్నాం


స్పెషలాఫీసర్లు సమస్యను పరిశీలిస్తారు. వాటిని పంచాయతీ కార్యదర్శులే పరిష్కరించాలి. గ్రామసభలు నిర్వహించి సమస్యలు అగిడి తెలుసుకుటారు. గ్రామాలకు వెళ్లాలి, గ్రామాభివృద్ధికి కృషి చేసేలా ఉన్నతాధికారులు సూచనలు ఇవ్వాలి
–అపర్ణ, ఎంపీడీఓ షాబాద్

వైభవంగా సంగమేశ్వర జాతర

మొయినాబాద్‌రూరల్: శివనామస్మరణతో సంగమేశ్వర జాతర మార్మోగింది. సోమవారం మండలంలోని కనకమామిడి సమీపంలో గల సంగమేశ్వర దేవాలయంలో జాతర వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా వేదపండితులు, పూజారులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవం ఘట్టం మరుసటి రోజు ఆలయంలో జాతర నిర్వహించడం ఆనవాయితీ. జంట నగరాలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది తరలివచ్చి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేదపండితులు, పూజారులు ఉ. 6 గంటలకే ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలో శివలింగంతో పాటు అమ్మవార్లను ప్రత్యేక పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి సమర్పించారు. భక్తులకు దర్శనంతో పాటు తీర్థప్రాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం కాస్లాబాద్ గ్రామ శివారులో రామోజీ కుంటకట్టను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు సోమవారం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 66లో గల రామోజీ కుంట కట్ట ద్వారా దాదాపు 30 ఎకరాలకు సంబంధించిన రైతుల పంట పొలాలకు సాగునీరు అందుతుందని వినతిలో పేర్కొన్నారు. ఈ కుంటకట్టను గ్రామానికి చెందిన చింతకింది కృష్ణయ్య ఆక్రమించుకుని కట్టపై ఉన్న చెట్లను, రాతి కట్టలను తొలగించాడని వాపోయారు. కుంటను చదునుచేసి వ్యవసాయ పొలంగా మార్చుకొని ఆక్రమించుకున్నాడని మండిపడ్డారు. కుంట ఆక్రమణతో పొలాలకు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు కోరారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మహిళలకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు

చేవెళ్ల/షాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని వెల్‌స్పన్ కంపెనీ డైరెక్టర్ జోషి అన్నారు. సోమవారం చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని మహిళల కోసం వెల్‌స్పన్ ఫౌండేషన్ సహకారంతో ఎస్‌సీఈపీ ఆధ్వర్యంలో నాలుగు కుట్టుమిషన్, 2 బ్యూటీషియన్ ఉచిత శిక్షణ కేంద్రాలను వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, ఎస్‌సీఈపీ ఈడీ శామ్యూల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోపగడే శిక్షణ కోర్సులను ప్రారంభించడంతో వారికి లబ్ధి చేకూరుతోందని చెప్పారు. మహిళలు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టుమిషన్ శిక్షణతో పాటు బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. చేవెళ్లలో రెండు, ధర్మసాగర్‌లో ఒకటి, షాబాద్ మండలంలో రెండు, చందనవెల్లిలో ఒకటి ప్రారంభించినట్లు చెప్పారు. వీటి ద్వారా మహిళలు వారికి అనుకూలంగా ఉన్న కేంద్రాల్లో శిక్షణ పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, ట్రైనర్‌లు మహిళలు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు, మహిళలు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

కొందుర్గు: ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. కొందుర్గు ప్రభుత్వ ఆస్పత్రి పనితీరుపై 'ఆసుపత్రి పనితీరు అస్తవ్యస్తం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్త పాఠకులకు విధితమే. సాక్షి కథనానికి స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సోమవారం కొందుర్గు ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని సబ్ సెంటర్ల వారీగా చర్చించి నిర్దేశించిన లక్ష్యాలను ఎందుకు సాధించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణీల పరీక్షలు, పిల్లలకు ఇచ్చే టీకాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య తగ్గిందని, పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని అన్నారు. సమయపాలన పాటించకుండా విధులకు నుంచి ముందుగానే వెళ్లిపోతున్న వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి పేషెంటుతో ఓపిక, సహనంతో వైద్య సేవలు అందించాలన్నారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్యులు అమ్రితజోసెఫ్, తబసుమ్‌మహారాజ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సీహెచ్‌ఓ పద్మ, డీపీఎంఓ వెంకటేశ్వర్లు, పీహెచ్‌ఎన్ లుధియా, ఎంపీహెచ్‌ఓ వినోద్, హెల్త్ సూపర్‌వైజర్లు మెర్లిన్, ఫార్మాసిస్టు గోపాలకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ పరమేశ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

రేపటి నుంచి కొనగట్టు బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయం, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 28 (బుధవారం) నుంచి మార్చి1వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ చైర్మన్, ధర్మకర్తలు సున్నపు వసంతం, మానిక్యప్రభు, ఆలయ ప్రధాన అర్చకులు సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు విద్యుత్ దీపకాంతులు, తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. 28న గణపతి పూజా హోమం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతులు అన్నదానం, భజన కార్యక్రమాలు, రెండవ రోజు 29న పునఃపూజా, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి సహస్ర పుష్పార్చన, రుద్ర హోమం, పూర్ణాహుతి, మంగళ హారతులు నిర్వహించనున్నారు. మూడవ రోజున రుద్రాభిషేకం, కుంకుమార్చన, భక్తులకు వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదం, తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన కొనగట్టు శివాలయం

సీసీ పనులు ప్రారంభం

మర్పల్లి: గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. సోమవారం మండల పరిధి బూచన్‌పల్లి అనుబంధ గిరిజన జాజుగుబ్బడి తండాలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. మండలంలో 27 గ్రామ పంచాయతీలకు స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్.. సీసీరోడ్ల అభివృద్ధికి సుమారు రూ.2 కోట్లు వెచ్చించారని తెలిపారు. ఆ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు నర్సింహ్మారెడ్డి, టోప్యానాయక్, గ్రామ కమిటీ యూత్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నేతలు

అంధకారంలో జాతీయ రహదారులు

- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- అలంకారప్రాయంగా వీధి దీపాలు
- ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: కొత్తూరు పట్టణం నుంచి విస్తరించిన జాతీయ రహదారి గుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగిస్తుంటాయి. రోడ్డు విశాలంగా ఉండడంతో గంటకు వందకు కిలోమీటర్ల వేగంతో వాహనాలు దూసుకెళ్తుంటాయి. రహదారి వెంట లైట్లు లేక చీకటిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా కూడళ్ల వద్ద రోడ్డు దాటే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా క్షణాల్లో ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. జాతీయ రహదారులకు సమీపంలోని గ్రామాలకు వెళ్లే కూ డళ్ల వద్ద రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాలను నివారించడానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని రోడ్డు నిర్వహణ చూసే కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అధికారుల సూ చనలు పట్టించుకోకపోవడంతో ఇప్పటికీ రాత్రి వేళ ల్లో జరిగే ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది.

ప్రారంభానికి నోచుకోని వీధి దీపాలు

జాతీయ రహదారిపై ఉన్న వైజంక్షన్, పెంజర్ల, వినాయక స్టీల్, తిమ్మాపూర్ చౌరస్తా, చేగూరు రోడ్డు కూడళ్ల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నియంత్రణకు ఆయా కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్ల, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కొత్తూరు పట్టణానికి చెందిన ప్రజలు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులలకు, పాలకులకు విన్నవించారు. రోడ్డు నిర్వహన చూస్తున్న సదరు కాంట్రాక్టర్లు గతేడాది క్రితం కేవలం వై జంక్షన్ కూడ లి నుంచి పెంజర్ల వరకు మాత్రమే వీధి దీపాలను ఏర్పా టు చేశారు. కానీ ఏడాది వీధి దీపాలకు నుంచి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో దీపాలు అలంకారప్రాయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు.


ప్రారంభానికి నోచుకోని వీధిదీపాలు

పట్టించుకోని అధికారులు

జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన వెంటనే హడావిడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదని కొత్తూరు, సమీప గ్రామాల ప్రజలు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు అభివృద్ధి చెందలేదన్నా రు. దీంతో చిన్న చిన్న పనులకు సై తం జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తూ స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లైట్లు ఏర్పాటు చేయాలి


మున్సిపాలిటీ పరిధిలో విస్తరించిన జాతీయ రహదారి పైన ఉన్న తిమ్మాపూర్ నుంచి వినాయక స్టీల్ కూడలి వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలి. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్లపై కూడా లైట్లు ఏర్పాటు చేయాలి. అప్పుడే స్థానికులు సర్వీస్‌రోడ్ల గుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉంటారు. – నాగరాజుచారి, కొత్తూరు

వెంటనే ప్రారంభించాలి


కొత్తూరు పట్టణంలోని వై జంక్షన్ నుంచి పెంజర్ల కూడలి వరకు ఏర్పాటు చేసిన వీధి దీపాలను వెంటనే ప్రారంభించాలి. టోల్‌ప్లాజా ద్వారా వాహనదారుల నుంచి సర్వీస్ చార్జీలు వసూలు వస్తున్న సంస్థ వాహనదారులకు కూడా సౌకర్యాలు కల్పించడం బాధ్యత అనే విషయాన్ని గుర్తుచేసుకోవాలి. కేవలం విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో వీధిదీపాలను ప్రారంభించడం లేదు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లి లైట్లు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.
– లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగానే ప్రారంభిస్తాం


ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ వీధి దీపాలకు సరిపోదు. దీంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైన వెంటనే వీధి దీపాలకు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది.
– ఇబ్రహీం, రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్

20వేల మందిని తరలిస్తాం


ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న శివభక్తులు

- చేవెళ్ల సభకు భారీగా జనసమీకరణ
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: చేవెళ్లలో నిర్వహించే భారీ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 20 వేల మందిని తరలిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహార్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం బొంకూర్ గ్రామంలో శివాలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు. మంగళవారం చేవెళ్లలో చేపట్టే బహిరంగ సభలో రూ.500 సిలిండర్‌తో పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు మంబాపూర్ నారాయణ రెడ్డి, కొమ్ము గోపాల్‌రెడ్డి, జితేంధర్‌రెడ్డిలు ఉన్నారు.

ముగిసిన ఆలయ మహోత్సవం

తాండూరు రూరల్: మండల పరిధి బిజ్వార్ అనుబంధ గ్రామం బొంకూర్‌లో శివాలయ పునర్నిర్మాణ మహోత్సవాలు ముగిశాయి. గ్రామంలోని పురాతన ఆలయాన్ని దాతల సహాయంతో ఇటీవల పునర్నిర్మించారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయం వద్ద నందీ విగ్రహ ఆవిష్కరణ, కలశం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. శివాలయం వద్ద బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, రాములు, శ్రీను, శివభక్తులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The members of general public are hereby informed that ours, clients have entered into an agreement of sale in respect of premises No. 2-4-60/4 admeasuring 3289.29 Sqyds in Sy. No. 29/AA laying and forming part of Sy. No. 29 situated at Upparpally Village, Rajendernagar Mandal, Ranga Reddy District bounded by North Neighbour's Property, South; 40 feet Wide Road, East: Solanki Niwas & property bearing No. 2-1-91&92, West; part of Sy. Nos. 29 with its owners and possessors Sri P. Janardhan Reddy and others and paid substantial amount towards advance sale consideration. If any member of general public has any right, title, claim or interest in respect of the said property, they are hereby called upon to furnish particulars of such claim along with copies of the documents etc., to the undersigned within a period of (7) days from the date of this publication failing which our clients shall proceed with the transaction and conclude the same and objections, if any, raised subsequently will not be entertained.

M. NARSIMHA REDDY, Advocate
M/s Ganu And Co Advocates
201-202, 3.5.874/A Vipanchi Estates,
Hyderguda, Hyderabad 500 029
Ph: 040-23234570/23232837

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564